క్లుప్తంగా

నగరపాలక సంస్థగా బోర్డు మార్పు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం బోర్డును శుక్రవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ (నగరపాలక సంస్థ)గా మార్పు చేశారు. జనవరి 27 నుంచి ఉన్నతీకరణకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ఈ పాటికే విలీనమైన దివిటిపల్లి గ్రామ పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్న విషయం విధితమే. తాజాగా జైనల్లీపూర్‌కు చెందిన అన్ని రికార్డులను మున్సిపల్ అధికారులు పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు.

పగిడ్యాల్ కృష్ణతాత జాతర

గండేడ్: పగిడ్యాల్ కృష్ణతాత (కృష్ణ బ్రహ్మేంద్ర స్వామి ఆరాదన మహోత్సవం) జాతర శనివారం నుంచి ప్రారంభమవుతుందని పగిడ్యాల్ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెంకట్‌రాములు తెలిపారు. ఆదివారం ఉదయం 6గంటలకు పల్లకీసేవ, సోమవారం అఖండ భజన, నందికోల సేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎమ్మార్పీ కార్యాలయం వద్ద శుక్రవారం సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎంఈఓ కురుమూర్తి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజ్ మైదానంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

సిలబస్‌కు అనుగుణంగా బోధన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మారిన సిలబస్‌కు అనుగుణంగా విద్యాబోధన చేయాలని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో శిశువు సమగ్ర అభివృద్ధిపై ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిలబస్‌లో జరిగిన మార్పులు, శిశువు అభివృద్ధికి సంబంధించి అధ్యాపకుల్లో అవగాహన కల్పించేందుకు మంచి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, మధుసూదన్‌రెడ్డి, రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, హెచ్‌ఓడీ జి.గం విశ్వనాథ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై గ్రామాల్లో సమీక్షలు

నవాబుపేట: మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారులు గ్రామాలకు వెళ్లి ఆరాతీసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 42 గ్రామాలకు సంబంధించి 1వ తేదీ నుంచి పదో తేదీ వరకు అన్ని గ్రామాల్లో సమీక్షలు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తారని ఆయన వివరించారు. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, పెద్ద వాటిని గుర్తించి వేసవికి ముందుగానే పరిష్కరించేలా కార్యచరణ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్‌లో పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

లైట్ల ఏర్పాటుకు రూ.50 లక్షలు సాయం

జడ్చర్ల: జడ్చర్ల–గంగాపూర్ ప్రధాన రహదారిపై లైట్లను ఏర్పాటు చేసేందుకు స్నేహ కోళ్ల దాణ పరిశ్రమ నిర్వాహకులు రూ.50 లక్షలు సాయంగా అందించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. గంగాపూర్ రహదారిపై స్నేహ పరిశ్రమ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని, రాత్రి వేళల్లో వాహనాల రాకపోకల సందర్భంగా ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐ తెలిపారు. ఇప్పటికే లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో లైట్లు అవసరం ఉందన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో లైట్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని సీఐ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో రూ.వేయి చొప్పున చెల్లించిన దరఖాస్తుదారుల కోసం తమ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పరిశీలించిన దరఖాస్తులకు సంబంధించి నిర్ణీత ఫీజును చెల్లించాలన్నారు. అర్హులందరూ వచ్చే మార్చి 31 లోగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడువులోగా ఓపెన్ ప్లాట్లను, లే–అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు.

మెరుగైన విద్య అందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, గురుకుల పాఠశాలల అర్‌సీఓలు, డీసీఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పెంచిన డైట్ చార్జీలకనుగుణంగా మెనూ అమలు చేయాలన్నారు. అన్ని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో కిచెన్, వాష్ ఏరియా వేరువేరుగా ఉండాలన్నారు. త్వరలో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌తో జూమ్ మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈఓ ప్రవీణ్ కుమార్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి, గిరిజన అభివృద్ధి అధికారి చత్రునాయక్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సుదర్శన్, ఆయా గురుకుల పాఠశాలల అర్‌సీఓలు, డీసీఓలు పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


సాయినగర్ సకలదేవతల ఆలయంలో వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్/కోయిలకొండ/దేవరకద్ర: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయాల్లో వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయినగర్ సకలదేవతల ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త పాలాది రమేష్, ఆర్యవైశ్యసంఘాల బాధ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- కోయిల్‌కొండ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షులు అశోక్, మందిపల్లి రాజు, చంద్రయ్య పాల్గొన్నారు.
- దేవరకద్ర మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం నిర్వహించారు. మహిళలు పాల్గొన్నారు.

వేరుశనగ టెండర్‌పై అదనంగా రూ.500 ఇవ్వాలి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు వేరుశనగ పంటను విక్రయానికి తీసుకొచ్చిన రైతులు టెండర్‌దారులు కుమ్మక్కు కావడంతో నష్టపోతున్నారని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లికి గిట్టుబాటు ధర విషయంలో ఆందోళన చేస్తే, టెండర్‌పై అదనంగా రూ.200 ఇస్తామని నేటికీ ఇవ్వలేదన్నారు. ప్రతిరోజు జరిగే టెండర్‌లో అదనంగా రూ.500 క్వింటాలుకు కలిపి ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నర్సింహులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు ఏ.రాములు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌రూల్స్ పాటించి ప్రాణాలు రక్షించాలి

నవాబుపేట: ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతివ్యక్తి పాటించాలని ఎస్‌ఐ విక్రమ్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్ నుంచి కొందుర్గు మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో రోడ్డు భద్రతకు సంబంధించి బోర్డులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్‌కు చెందిన విజయ్ ఆస్పత్రి డాక్టర్ చందులాల్ సొంత ఖర్చులతో రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బోర్డులను పోలీసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఎస్‌ఐ మాట్లాడారు. రోడ్డు నిబంధనలు పాటించకపోవటం ప్రాణాలుపోయో అవకాశాలున్నాయన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వటం సైతం నేరమని, దీన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ప్రధాన రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు చందర్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు రాజు, రఘు, కృష్ణయ్య, లంబ వెంకటయ్య, సేవ్యానాయక్, లింభ్య, సత్యనారాయణ, రమేష్‌నాయక్, నర్సింహులు ఉన్నారు.


కొల్లూర్‌లో ట్రాఫిక్ బోర్డులు ప్రారంభిస్తున్న పోలీసులు

మార్కెట్‌లోకి హీరో డెస్టిని 125స్కూటీ



పాలమూరు: హీరో కంపెనీ నుంచి సరికొత్త హంగులతో మార్కెట్‌లోకి వచ్చిన హీరో డెస్టిని 125 స్కూటీని పట్టణంలోని అశ్విని హీరో షోరూంలో షోరం ఎండీ దిలీప్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఈ స్కూటీలో అత్యాధునిక హంగులు, యువత అభిరుచికి తగినట్లుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, డిజిటల్ మీటర్‌తో పాటు బ్లూటూత్ కనెక్టివిటీతో జీపీఎస్ నావిగేషన్ ఉందన్నారు. ఆటో క్యాన్సల్ వింకర్స్, పెట్రోల్ కిలోమీటర్ రెంజ్ చూపించే అడ్వాన్స్ ఫీచర్ దీంట్లో ఉందన్నారు. లాంగ్ సీట్, 18లీ బూట్‌స్పెస్, అధిక లెగ్ రూమ్‌స్పెస్‌తో పాటు మొబైల్ ఛార్జింగ్ సౌకర్యం ఉందన్నారు. షోరూం మేనేజర్ రాజశేఖర్, పట్టణ మెకానిక్ సంఘం అధ్యక్షుడు సిద్దేశ్వర్, బాలరాజు, రమేష్ వినియోగదారులు ఉన్నారు.

ప్రతిభాపాటవాలు పెంపొందాలి



గండేడ్: విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు పెంపొందాలని మండల విద్యాధికారి జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌ఈఆర్‌టీ, ఎఫ్‌పీఎస్‌టీ సంయుక్తంగా భౌతికశాస్త్రం ప్రతిభా పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలన్నారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు తిరుపతయ్య, రాధిక, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నవాబుపేట: మండల కేంద్రంలో తాగునీటి సమస్యతో రెండు వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం ప్రజల ద్వారా తెలుసుకుని, వాటిని సొంత ఖర్చులతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి పూర్తి చేశారు. మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయం వీధుల్లో తాగునీటి సమస్య ఉందని అక్కడి ప్రజలు వివరించారు. దీంతో నర్సింహచారి జేకే ట్రస్టు ద్వారా తన సొంత ఖర్చులతో కొత్త పైప్‌లైన్లు వేయించి తాగునీటి సమస్యను శుక్రవారం పరిష్కరించారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, నవాబుపేట డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ అంజయ్య, కేశవులు, మహేష్, బాను, చందు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కోయిల్‌కొండ: చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని శ్వేతావిద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ నరేందర్‌జీ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలలో శ్వేతావిద్యామందిర్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సంతోష్ బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం సుహార, పీఈటీ వీరన్న పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తిభావం పెరగాలి



అడ్డాకుల: ప్రజల్లో మరింత భక్తిభావం పెరగాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు నాగలక్ష్మి, డీకే ఆంజనేయులు అన్నారు. మండలంలోని చిన్న మునుగల్‌చేడ్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ మహబూబ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమార్చన, లలిత సహస్రనామం నిర్వహించారు. నాలుగు రోజులుగా రాత్రివేళ జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా భజనలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఎంఈఓకు ఘన సన్మానం

దేవరకద్ర: మండల విద్యాధికారిగా పని చేసి బదిలీ అయిన జయశ్రీని శుక్రవారం బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఆమె గత నాలుగు సంవత్సరాలుగా మండల విద్యాధికారిగా సేవలు అందించడంపై పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈఓ బలరాం, టీఎస్‌యూటీఎఫ్, టీపీయూఎస్, పీఆర్‌టీయూ టీఎస్, టీ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు శంకర్, కృష్ణ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ ద్వారా బాల కార్మికులకు విముక్తి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో జనవరి 1నుంచి 31వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్–11 ద్వారా 45మంది బాల కార్మికులను గుర్తించినట్లు ఆపరేషన్ స్మైల్ నోడల్ అధికారి, ఏఎస్పీ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమం ద్వారా 37మంది బాలురు, 8మంది బాలికలను గుర్తించి హోంకు తరలించినట్లు తెలిపారు. పలు చోట్ల బాల కార్మికులుగా పని చేస్తున్న వారితో పాటు అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను గుర్తించి రక్షించి పునరావాసం కల్పించినట్లు తెలిపారు.

పీయూలో డప్పులతో సన్నాహక ర్యాలీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్‌లో 7న జరిగే 'లక్షల డప్పులు.. వేల గొంతులు'ను జయప్రదం చేయాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ అన్నారు. పీయూలోని ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో సన్నాహక ర్యాలీతో పాటు సదస్సు నిర్వహించారు.

మైనార్టీలకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల సంక్షేమం కేంద్ర ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌లో ప్రతి రాష్ట్రానికి రూ.వెయ్యికోట్లు కేటాయించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జహంగీర్‌బాబా అన్నారు. జిల్లా కేంద్రం సద్దలగుండులోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిధులు కేటాయిస్తే రాష్ట్రాల్లో మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యాసంస్థల అభివృద్ధితోపాటు ఇతర సంక్షేమ పథకాలను అమలుచేసే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్‌యాఖేబ్, షేక్‌మహెమూద్, మహెబూబ్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన నీలి మెరుపు బహుజన క్యాలెండర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ రూరల్: జ్ఞాన నీలి మెరుపు బహుజన 2025 నూతన క్యాలెండర్‌ను శుక్రవారం పాత పాలమూరులోని జై భీమ్ చౌరస్తాలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకుడు ఏపీ మిథున్‌రెడ్డిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలోపాతూరు రమేష్, సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, డాక్టర్ నాగయ్య, ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు, పురుషోత్తం పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మహమ్మదాబాద్: మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. శుక్రవారం మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌ఈఆర్‌టీ, ఎఫ్‌పీఎస్‌టీ సంయుక్తంగా ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు శ్రీకాంత్, రవికిరణ్, గీత, రజిత, విజయభాస్కర్, శ్రీనివాస్,పాల్గొన్నారు.

బాలికలకు శాలువాల పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్రతే సయ్యదా జైనబ్ అలైహిసలాం జయంతిని పురస్కరించుకొని గులేమానే అహ్లెబైత్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల–3 పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు ప్రార్థన శాలువాలను (దుప్పట్టాలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సయ్యదా జైనబ్ త్యాగం, ధైర్యసాహసాల గురించి బాలికలకు వివరించారు.

అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి


కౌకుంట్లలో ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర రూరల్: నూతనంగా ఏర్పడిన కౌకుంట్ల మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కౌకుంట్లలో మండల పరిషత్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. ఎంపీడీఓగా శివప్రసాద్‌కు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం గెజిట్ లేకుండా తూతూ మంత్రంగా కౌకుంట్లను మండలంగా ప్రకటించిందని, దీనివల్ల జీతాలు రాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ మంత్రిని కలిసి మండల ఏర్పాటుకు గెజిట్ చేయించి మండల పరిషత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.78 లక్షలతో పీహెచ్‌సీ సెంటర్‌ను నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో త్వరలోనే తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, అంజిల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, మార్కెట్ చైర్మన్ కతలయ్య, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మికాంత్‌రెడ్డి, కొన రాజశేఖర్, మాజీ సర్పంచ్ స్వప్న, నరేష్, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దేవరకద్ర/అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన పలువురు బాధితులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. దేవరకద్ర, మూసాపేట మండలం చక్రాపూర్‌కు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా రెండో దఫా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ చక్రాపూర్‌లో ఎమ్మెల్యేను కలి శాలువాతో సత్కరించారు.

అంబులెన్స్ మంజూరు చేయాలి

చిన్నచింతకుంట: చిన్నచింతకుంటకు అంబులెన్స్ మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, కురుమూర్తి స్వామి ఆలయ కమిటీ మెంబర్ భాస్కర్, ప్రతాప్, గూడూర్ శేఖర్, సురేష్, పలువురు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమంలో గద్దర్‌ది కీలకపాత్ర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం రగిల్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ప్రజాకవి, ప్రజాగాయకుడు గద్దర్ అని జిల్లా పౌర సంబంధాల అధికారి పి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రజా గాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా తెలంగాణ చౌరస్తాలో జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్స్‌పెక్షన్ ఇంజినీర్ ఇస్రా నాయక్, రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజ్ జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులతో కలిసి గద్దర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల ఆట పాటలతో గద్దర్ స్వయంగా పాడిన పాటలు, ఆయనపై కళాకారు లు రచించిన పాటలు పాడారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు అశోక చారి, విజయ్‌కాంత్, జయ ప్రకాష్, ఉదయ్, ఫ్రాంక్లిన్, సంతోషమ్మ, పద్మ కళాకారులు పాల్గొన్నారు.


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న డీపీఆర్‌ఓ శ్రీనివాస్

అక్రమ మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

జడ్చర్ల: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని, స్థానిక కొశగుట్ట ప్రాంతంలో రెవెన్యూ అధికారులు, తమ సిబ్బంది కలిసి విచారించినట్లు శుక్రవారం జిల్లా మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, ఇటీవల పత్రికలలో వచ్చిన కథనాలపై జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు స్పందించి విచారించారు. విచారణ సమయంలో ఎలాంటి అక్రమ తవ్వకాలు జరలేదని తెలిపారు. బూరెడ్డిపల్లి శివారులో సర్వే నంబర్123లో అశోక్‌గౌడ్‌కు 2.20 ఎకరాల భూమి, భరద్వాజ్‌కు 7.10 ఎకరాల భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరు తమ భూముల్లో రెండు హిటాచీ యంత్రాలను ఉపయోగించి భూమిని చదును చేసుకుంటున్నారని పేర్కొన్నారు. జీఓ నంబర్ 139 ప్రకారంగా పట్టా భూములలో మట్టిని తవ్వి చదును చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అక్రమ మైనింగ్‌పై తమకు ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి చర్యలు చేపడుతున్నామని, నిరంతరం నిఘా పెట్టామని పేర్కొన్నారు.

షెట్టర్లు రీ టెండర్ వేయాలని ఆందోళన

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన షెట్టర్లు రీటెండర్లు వేయాలని గ్రామానికి చెందిన పలువురు ఆందోళనకు దిగారు. గురువారం నుంచి ఆందోళన కొనసాగిస్తుండగా శుక్రవారం వంటావార్పు చేపట్టారు. ఏళ్ల తరబడి షెట్టర్ల టెండర్లు నిర్వహించడం లేదని, తక్కువ కిరాయికి తీసుకుకొని వేరేవాళ్లకు ఎక్కువ కిరాయికి అద్దెకు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. దీంతో బాధిత నిరుద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ గాంధీనాయక్, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. రీ టెండర్లు వేయడానికి పాత కమిటీని రద్దు చేస్తూ కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా తహసీల్దార్ తిరుపతయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఎంఈఓ రాజు, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిలను కమిటీ సభ్యులుగా నియమించారు. కొత్త కమిటీ నిర్ణయం మేరకు త్వరలో రీ టెండర్లు నిర్వహించనున్నట్లు సీఐ పేర్కొన్నారు.


ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

బీసీ రాజకీయ యుద్ధభేరికి తరలిరండి

స్టేషన్ మహబూబ్‌నగర్: హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు అత్యధిక సంఖ్యలో బీసీలు తరలిరావాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌సాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 77 ఏళ్లుగా బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై బీసీలందరం ఏకం కావాలనే లక్ష్యంతో ఈ రోజు బీసీ సమాజం ఎదురుచూస్తుందన్నారు. , భవిష్యత్‌లో రాజ్యాధికారం సాధించేందుకు అందరు ఐక్యమత్యంతో ముందుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ నిరుద్యోగుల పాలిటశాపంగా మారిన ఈడబ్ల్యూఎస్ రద్దు చేయాలన్నారు. బీసీ నాయకులందరూ తమ పార్టీ జెండాలను పక్కనపెట్టి బీసీ ఏజెండాతో సభలో పాల్గొనాలని కోరారు.



వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వాల్మీకి బోయలను బీసీ ఏ నుంచి ఎస్టీలో చేర్చాలని తెలంగాణ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు పట్టణశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం టీఎన్‌జీఓ భవన్‌లో వాల్మీకి బోయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి మనకు అందించిన గ్రంథం రామాయణం ఎంతో గొప్పదని, వాల్మీకి బోయలు తెలంగాణలో అన్ని విధాలుగా అణిచివేతకు గురయ్యారన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో దళితులుగా, మరికొన్ని రాష్ట్రాల్లో షెడ్యూలు తెగల చెందిన ఉన్నారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి పద్మజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బెక్కెం జనార్దన్, పండుగ సాయన్న సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జీటీ కృష్ణముదిరాజ్, మైత్రి యాదయ్య, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎంపీటీసీ స్థానాలపై అఖిలపక్ష సమావేశం

చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ స్థానాలపై శుక్రవారం చిన్నచింతకుంట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిడీఓ సుధాకర్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు ఎంపీటీసీ స్థానాల ఎంపికపై వివరాలు వచ్చాయన్నారు. అభ్యంతరాలుంటే తెలుపాలని కోరారు. చిన్నచింతకుంట మండలానికి గతంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా, 13 ఎంపీటీసీ స్థానాలుండేవన్నారు. ప్రస్తుతం మండలాల విభజన కారణంగా తిర్మలాపురం, దాసర్‌పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల కౌకుంట్ల మండలంలో కలిశాయన్నారు. దీంతో ప్రస్తుతం 18 గ్రామ పంచాయతీలకు 11 స్థానాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిమూద్, కుర్వరమేష్, గంజి బాల్‌రాజు ఉన్నారు.